సాక్షి
జనగామ

గురువారం | 9 | మార్చి | 2023



విద్యార్థిని ప్రదర్శన..



నేటి నుంచి పలు రైళ్ల రద్దు

డోర్నకల్–విజయవాడ రైలు మార్గంలో మూడో లైన్ నిర్మాణ పనులు జరుగుతుండటంతో నేటి నుంచి పలు రైళ్లు రద్దు కానున్నాయి. - 8లో▸



ఎస్‌ఐ వేధింపులతోనే..

నా కొడుకు ఎస్‌ఐ శ్వేత వేధింపుల వల్లే మరణించాడని ఆరోపిస్తూ మృతుడు వంశీకృష్ణ తల్లి రాధ, కుటుంబ సభ్యులు ఎంజీఎం మార్చురీ వద్ద ఆందోళన చేపట్టారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
35^0 / 18^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. రాత్రి పూట చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, పక్కన మంత్రి దయాకర్‌రావు తదితరులు



సంగీత విభాగంలో వరంగల్‌కు చెందిన ఓని సిస్టర్స్‌ను సన్మానిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, మేయర్ తదితరులు - వివరాలు 8లో▸

మహిళలది దృఢసంకల్పం

- రాష్ట్ర గిరిజన, మహిళా సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- కాకతీయ యూనివర్సిటీలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

రాష్ట్ర ప్రభుత్వం, మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలోని ఆడిటోరియంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మేయర్ సుధారాణి, మహిళా శిశుసంక్షేమశాఖ కమిషనర్ భారతి హోలికేరీ, కలెక్టర్ సిక్తా పట్నాయక్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్టసేవలను అందించిన 27మంది మహిళలను సన్మానించారు.

- కేయూ క్యాంపస్

న్యూస్‌రీల్

పదోన్నతులు, బదిలీలు ప్రారంభించాలి



జనగామ రూరల్: వాయిదా పడిన పదోన్నతులు, బదిలీలను ప్రారంభించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మాణిక్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు ఎర్రగొల్లపహాడ్, గానుగుపహాడ్, వడ్లకొండలో కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో గుడుగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య మహాప్రభువు అవతరణ తిథి ఉత్సవం



జనగామ : పట్టణంలోని సిద్దిపేట రోడ్డు గీతాశ్రమం కృష్ణా మందిరంలో ఇస్కాన్ హరే కృష్ణ ప్రచారకేంద్రం ఆధ్వర్యంలో బుధవారం శ్రీ చైతన్య మహా ప్రభువు అవతరణ తిథి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు ధనుంజయ పండిత్ దాస్, శ్రీసనాతన దాస్, పండరీపురధామ్ దాస్, కొయ్యడ యాదగిరి, కోడం రమేష్, ఆలయ కోశాధికారి బచ్చు బాలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా ప్రణాళికతో చదవాలి



కొడకండ్ల: విద్యార్థుల భవిష్యత్‌కు ఇంటర్ విద్య కీలకమని, ఈనెల 15 నుంచి ప్రారంభమయ్యే వార్షిక పరీక్షలు రాయబోయేవారు ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికతో చదువుకోవాలని డీఐఈఓ బైరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సెకండియర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచి ఫలితాలు సాధించి కొడకండ్ల కళాశాలను జిల్లా అగ్రస్థానంలో నిలపాలని కోరారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహిళా దినోత్సవం సందర్భంగా కెమిస్ట్రీ అధ్యాపకురాలు మమతను డీఐఈఓ సన్మానించారు. ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ అందె యాకయ్య, డీఈసీ మెంబర్ ఆంజనేయ రాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

ఒకరికి తీవ్ర గాయాలు



స్టేషన్‌ఘన్‌పూర్: నమిలిగొండ శివారు మోడల్ స్కూల్ సమీపాన ఘన్‌పూర్–నమిలిగొండ రోడ్డుపై బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో చిర్ర స్వామి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేటకు చెందిన చిర్ర స్వామి భార్యతో కలిసి వ్యక్తిగత పనిమీద బైక్‌పై ఘన్‌పూర్‌కు వచ్చాడు. తిరిగి వెళ్తుండగా మోడల్ స్కూల్ సమీపాన ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. స్వామి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు 108 సిబ్బంది బాధితుడిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. స్వామి పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు 108 సిబ్బంది రాజేంద్రప్రసాద్ తెలిపారు.

పథకాలు.. ప్రారంభోత్సవాలు



సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తదితరులు

ఉత్సాహంగా సాగిన కేటీఆర్ తొర్రూరు పర్యటన

- మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ
- పట్టణంలో ర్యాలీ, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు
- మహిళలతో సభ.. కాబోయే సీఎం అంటూ ప్లకార్డుల ప్రదర్శన

తొర్రూరు/తొర్రూరు రూరల్: సంక్షేమ పథకాల పంపిణీ.. పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలతో రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు బుధవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పర్యటన బిజీబిజీగా సాగింది. వరంగల్ జిల్లా ఏనుగల్లు నుంచి హెలికాప్టర్ ద్వారా తొర్రూరు చేరుకున్న మంత్రి ముందుగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మాట్లాడారు. మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళలను సన్మానించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కులు అందించారు. 500మందికి కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అలాగే ఇటీవల ఆత్మహత్య చేసుకున్న మెడికో విద్యార్థిని ప్రీతికి ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో నివాళులర్పించారు. అనంతరం తొర్రూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రూ.4కోట్ల వ్యయంతో నిర్మించిన మోడల్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కూరగాయలు అమ్ముతున్న లక్ష్మితో మాట్లాడారు. 'బేరం ఎలా సాగుతుంది.. గిట్టుబాటు అవుతుందా' అని అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం మీకు సాయం చేస్తుందా.. మీరు సంతోషంగా ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. రూ.2కోట్లతో యతిరాజారావు పార్కులో చేపట్టిన చిల్డ్రన్ పార్కు, రూ.5కోట్లతో చేపట్టిన ఆడిటోరియం, రూ.3.75 కోట్లతో చేపట్టిన డివైడర్, సెంట్రల్ లైటింగ్‌ను కేటీఆర్ ప్రారంభించారు.

దేశంలోనే ఆదర్శ మంత్రి దయాకర్‌రావు..

దేశంలోనే ఆదర్శవంతమైన పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా దయాకర్‌రావు నిలిచారని మంత్రి కేటీఆర్ కొనియాడారు. ఈ విషయం తాను చెబుతున్నది కాదని, సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన పథకం అందజేసిన కేంద్ర ప్రభుత్వం చెప్పిన మాటలన్నారు. గత ఎన్నికల్లో 56వేల ఓట్ల మెజార్టీతో దయాకర్‌రావును గెలిపించారని, ఇప్పుడు నేను పోటీచేసే సిరిసిల్ల కంటే ఎక్కువ మెజార్టీ ఇచ్చేందుకు మీరు సిద్ధమేనా అని సవాల్ విసిరారు.



మంత్రి ఎర్రబెల్లికి ఆర్డర్ కాపీ ఇస్తున్న కేటీఆర్



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న కేటీఆర్

వరాల జల్లు..

మంత్రి కేటీఆర్ పాలకుర్తి నియోజకవర్గానికి వరాలు కురిపించారు. తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.25కోట్లు ప్రకటించారు. కొడకండ్లలో 20ఎకరాల్లో మినీ టెక్స్‌టైల్ పార్కు మంజూరు చేస్తున్నట్లు కేటీఆర్ ప్రకటించి ఆర్డర్ కాపీని మంత్రి దయాకర్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీలు పసునూరి దయాకర్, మాలోత్ కవిత, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, అరూరి రమేష్, రెడ్యానాయక్, నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌రావు, కార్పొరేషన్ల చైర్మన్లు వాసుదేవరెడ్డి, నాగూర్ల వెంకన్న, సతీష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, గ్రామీణాభివృద్ధి కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, స్త్రీ నిధి ఎండీ విద్యాసాగర్‌రెడ్డి, కలెక్టర్ శశాంక, మున్సిపల్ చైర్మన్లు పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, మంగళపల్లి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా..

మంత్రి కేటీఆర్ పర్యటన ఉత్సాహంగా సాగింది. హైదరాబాద్‌లో జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని తొర్రూరులో జరిపించాలని పట్టుబట్టారని, సీఎం కేసీఆర్ ఈ రోజు రూ.1,550 కోట్ల నిధులు మహిళలకు ఇస్తున్నారని మంత్రి కేటీఆర్ చెప్పడంతో సభలో ఉన్నవారంతా చప్పట్లతో కృతజ్ఞతలు తెలిపారు. కాబోయే ముఖ్యమంత్రి కేటీఆర్ అని సభలో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రి దయాకర్‌రావు కేటీఆర్‌ను కోరుతూ.. కాబోయే ముఖ్యమంత్రి అని పొగడ్తలతో ముంచెత్తారు.

క్రిటికల్ కేర్ సెంటర్ ప్రజలకు వరం

- రూ.23కోట్ల వ్యయంతో ఏర్పాటు
- భూమిపూజలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



శంకుస్థాపన అనంతరం నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ తదితరులు

జనగామ: క్రిటికల్ కేర్(ట్రామాలెవల్–2) సెంటర్ జిల్లా ప్రజలకు వరం లాంటిదని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం సమీపాన ఐదెకరాల స్థలంలో రూ.23కోట్ల వ్యయంతో చేపట్టే 50 పడకల క్రిటికల్ కేర్ సెంటర్ నిర్మాణానికి జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డితో కలిసి ఆయన బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రిటికల్ కేర్ సెంటర్‌లో 24 గంటలపాటు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, సాధారణ పరేషన్లతో పాటు ఆర్థోపెడిక్ సర్జరీలు, అనస్థీషియా, ఎమర్జెన్సీ మెడిసిన్, రేడియాలజీ, ట్రామా కేర్ సదుపాయాలన్నీ ఉంటాయని చెప్పారు. ఆరు నెలల్లో ఎమర్జెన్సీ సేవలను అందుబాటులోకి తెచ్చేలా ప్లాన్ చేస్తున్నామన్నారు. ఇక్కడే మరో 5 ఎకారాల స్థలంలో మెడికల్ కళాశాలకు అనుబంధంగా రూ.47 కోట్లతో నిర్మిస్తున్న జనరల్ ఆస్పత్రి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్‌రావు, పసరమడ్ల సర్పంచ్ శివరాత్రి స్వప్నరాజు, ఎంపీపీ మేకల కలింగరాజు, జెడ్పీటీసీ నిమ్మతి దీపికామహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కార్యాలయ కోఆర్డినేటర్ డాక్టర్ సుల్తాన్‌రాజ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో నిందితుడి హైడ్రామా..



జనగామ ఏరియా ఆస్పత్రిలో ఉపేందర్‌నాయక్

దేవరుప్పుల: ఓ కేసులో వ్యక్తిని కోర్టుకు హాజరు పరిచే క్రమంలో పోలీసులు వైద్యపరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లగా హైడ్రామా చేయడంతో గందరగోళం నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. ధారావత్ తండా జీపీ పరిధి గోప్యనాయక్ తండాలోని ఉపేందర్‌నాయక్ భూమి పక్క నుంచి భానోతు లక్ష్మణ్ నాయక్ పంట సాగుకు పైపులైన్ ద్వారా నీరు పారిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 1న ఉపేందర్ నాయక్ పైపులు పగులగొట్టి బెదిరించాడని లక్ష్మణ్ నాయక్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసు విషయమై ఉపేందర్‌ను బుధవారం పోలీసులు కోర్టుకు హాజరు పరిచే క్రమంలో జనగామ ఏరియా ఆస్పత్రికి పరీక్షల నిమిత్తం తీసుకెళ్లారు. అయితే తనను పోలీసులు విచక్షణరహితంగా కొట్టారని, అనారోగ్యానికి గురయ్యానని, పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశాడు. దీంతో వైద్యులు పరీక్షలు నిర్వహించి జడ్జి ఎదుట హాజరుపర్చగా అతడికి బెయిల్ మంజూరు చేశారు. ఈ విషయమై ఎస్సై మునావత్ రమేష్‌నాయక్ వివరణ కోరగా చట్టపరంగా కోర్టుకు హాజరుపరిచే క్రమంలో కావాలని కట్టుకథ అల్లాడే తప్ప తాము ఎలాంటి ఇబ్బందులకు గురిచేయలేదన్నారు. అతడిపై ఈ కేసుతో పాటు మరో ఐదు కేసులు నమోదయ్యాయన్నారు.

అందని వేతనం
మంత్రులకు నిరసన సెగ
మహిళలకు ఉద్యోగావకాశాల్లో పెద్దపీట
అనుమతులు రద్దు చేయాలని వినతి
మంత్రులు రాజీనామా చేయాలి
10లో

పోలీస్‌లకు సవాల్‌గా ప్రీతి కేసు

- ఎంజీఎం ఆస్పత్రిని రెండోసారి సందర్శించిన సీపీ
- ఆపరేషన్ థియేటర్, ఆర్‌ఐసీయూ పరిశీలన
- సహచర విద్యార్థులనుంచి వివరాల సేకరణ

ఎంజీఎం : ప్రీతి మరణంపై న్యాయం జరగాలనే సర్వత్రా జరుగుతున్న ఆందోళనలు.. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును కీలకంగా పరిగణించిన నేపథ్యంలో స్వయంగా పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ కేసు విచారణ చేపడుతున్నారు. సైఫ్‌ను అరెస్టు చేసిన రోజు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసే ముందు ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించి పరిపాలనాధికారులతో ఘటన వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన బుధవారం సాయంత్రం మరోమారు ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించారు. ప్రీతి అపస్మారక స్థితికి వెళ్లక ముందు విధులు నిర్వర్తించిన ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్, అపస్మారక స్థితిలోకి వెళ్లిన గదిని పరిశీలించారు. అంతే కాకుండా ప్రీతితో వైద్యవిద్యనభ్యసిస్తున్న సహచరులను, సీనియర్ పీజీ విద్యార్థులను విచారించారు. సుమారు రెండు గంటల పాటు ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించి పూర్తిస్థాయిలో వివరాలు సేకరించారు.

హత్య అన్న ఆరోపణల నేపథ్యంలో..

ప్రీతి ఘటన వరంగల్ పోలీసులకు సవాల్‌గా మారింది. ఈ ఘటనపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఇంకా సద్దుమణగలేదు. ప్రీతి అనస్తీషియా తీసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని భావిస్తున్న క్రమంలో టాక్సికాలజీ నివేదికలో ఎలాంటి మత్తు పదార్థాలు తీసుకోలేదనే విషయం వెల్లడి కావడంతో ఈ ఘటనపై మరింత ఆసక్తి నెలకొంది. ప్రీతిని హత్య చేశారని కుటుంబ సభ్యులు బలంగా ఆరోపిస్తున్న క్రమంలో ప్రీతి కేసును ఛేదించేందుకు స్వయంగా కమిషనరే రంగంలో దిగి దర్యాప్తు చేపడుతున్నారు. ప్రీతి కేసులో ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా ఒక్కటికి రెండు మార్లు పరిశీలిస్తూ ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే ఆస్పత్రిలో ఆ రోజు ఏం జరిగిందనే విషయాన్ని తెలుసుకునేందుకు సీసీ పుటేజీ రికార్డులను సైతం స్వాధీనం చేసుకున్నారు. అంతే కాకుండా ఆస్పత్రిలో ఆ సమయంలో విధులు నిర్వర్తించిన వైద్యులను, వైద్యసిబ్బందిని సైతం పోలీసుల ఇప్పటికే విచారించారు. ప్రీతి, సైఫ్ మొబైల్ ఫోన్‌ల నుంచి లభిస్తున్న సాంకేతిక ఆధారాలను సరిపోలుస్తూ ప్రీతి మరణం వెనుక ఉన్న అసలు విషయాలు వెలుగులోకి తెచ్చేందుకు పోలీసు కమిషనర్ తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు.

శ్రీతిరుమలనాథుడికి వైభవంగా చక్రస్నానం



స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

స్టేషన్‌ఘన్‌పూర్ : డివిజన్ కేంద్రంలోని శ్రీతిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు బుధవారం స్వామివారికి చక్రస్నానం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కలకోట రంగాచార్యులు, ప్రధాన పూజారి రామానుజచార్యులు, అర్చకులు శేషాచార్యులు, వరుణాచార్యులు, సంతోషాచార్యులు, సద్గుణాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకోగా.. ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పూజల్లో యాగశాల నిర్మాణదాత గన్ను శ్రీనివాస్–సునీత దంపతులు, ఎంపీటీసీ గన్ను నర్సింహులు, భక్తులు నీల గట్టయ్య, మహంకాళి రవీందర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్యానికి సర్కారు భరోసా



జనగామలో ఆరోగ్య మహిళా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎమ్మెల్యే



ఇప్పగూడెం పీహెచ్‌సీలో.. ఎమ్మెల్యే రాజయ్య, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

- ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, తాటికొండ
- జిల్లా కేంద్రం, ఘన్‌పూర్, ఇప్పగూడెంలో ఆరోగ్య మహిళా కేంద్రాలు ప్రారంభం

జనగామ/స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ 'ఆరోగ్య మహిళా' పథకానికి శ్రీకారం చుట్టారని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు స్టేషన్‌ఘన్‌పూర్, ఇప్పగూడెం పీహెచ్‌సీల్లో ఆరోగ్య మహిళా కేంద్రాలను వేర్వేరుగా ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, మహిళా జెడ్పీటీసీ నిమ్మతి దీపిక పాల్గొన్నారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆరోగ్య మహిళా పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి మాట్లాడారు. మహిళల ఆరోగ్యంపై తెలంగాణ సర్కారు ప్రత్యేకంగా దృష్టి సారించిందని, షుగర్, బీపీ, థైరాయిడ్, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ తదితర ఎనిమిది రకాల పరీక్షలు చేసి అవసరమైన వైద్య సేవలను ఆరోగ్య మహిళా కేంద్రాల్లో అందించనున్నారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆస్పత్రి మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు తెలిపారు. జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు అన్ని రంగాల్లో సమాన గౌరవం దక్కుతుందన్నారు. కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ.. టీనేజీ నుంచి వృద్ధాప్యం వరకు ప్రతి మహిళా ఈ సెంటర్‌లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అలాగే ప్రతి మంగళవారం జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తారని, అనారోగ్య సమస్యలు లేకున్నా ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని చెప్పారు. క్యాన్సర్ పరీక్షలు చేయడానికి ప్రత్యేక శిక్షణ పొందిన గైనిక్ డాక్టర్ స్వప్న మాట్లాడుతూ.. ఆరోగ్య మహిళా సెంటర్‌లో 24 గంటలు సేవలు అందిస్తామని, క్యాన్సర్‌ను మొదటి దశలో ఉన్నట్లు గుర్తించి చికిత్స అందిస్తే ప్రాణం కాపాడుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

కార్యక్రమంలో బీఆర్‌ఎస్ టీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ తాళ్ల సురేష్‌రెడ్డి, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్లు మహేష్, శంకర్, శ్రీకాంత్, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, ఎంపీపీ మేకల కలింగరాజు, పార్టీ జిల్లా కార్యాలయ కోఆర్డినేటర్ డాక్టర్ సుల్తాన్‌రాజా, మున్సిపల్ వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, కౌన్సిలర్లు కర్రె శ్రీనివాస్, బండ పద్మ, పాక రమ, పేర్ని స్వరూప, వాంకుడోతు అనిత, దేవరాయ నాగరాజు, కోఆప్షన్ సభ్యుడు మసిఉర్ రెహమాన్, బాల్దె సిద్ధిలింగం, నర్సింగ్, మిద్దెపాక లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, ఇప్పగూడెం పీహెచ్‌సీలలో ఆరోగ్య మహిళా కేంద్రాలను అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్‌తో కలిసి ఎమ్మెల్యే రాజయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ కేంద్రాల్లో పైసా ఖర్చు లేకుండా 57 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తారని, ముందు జాగ్రత్తగా ప్రతి మహిళ షుగర్, బీపీ, థైరాయిడ్, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ తదితర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ విషయమై ఆశ కార్యకర్తలు తమ పరిధిలోని మహిళల ఆరోగ్య సమస్యల్ని గుర్తించి ఆరోగ్య మహిళా కేంద్రానికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్, ఆర్‌డీఓ కృష్ణవేణి, చిల్పూరు దేవస్థాన కమిటీ చైర్మన్ శ్రీధర్‌రావు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రవీందర్‌గౌడ్, డాక్టర్ అశోక్, డాక్టర్ సంధ్య, డాక్టర్ భాస్కర్, డాక్టర్ కావ్య, డాక్టర్ ప్రణీత, సర్పంచ్ సురేష్‌కుమార్, ఎంపీటీసీ విజయలక్ష్మి, ఎల్లగౌడ్ పాల్గొన్నారు.

భార్యతో గొడవ.. బలవన్మరణం


కార్తీక్(ఫైల్)

దామెర: భార్యతో గొడవ జరిగిందని మనస్తాపంతో పురుగుల మందు తాగి హనుమకొండ జిల్లా దామెర మండలం ముస్త్యాలపల్లి శివారులో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్‌కు చెందిన పుప్పాల కార్తీక్(32) హైదరాబాద్ ఎస్‌బీఐలో ఫీల్డ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. భార్య వ్యూహ ఇద్దరు కూతుళ్లతో హైదరాబాద్‌లో నివాసం ఉంటోంది. ఈక్రమంలో మంగళవారం మధ్యాహ్నం భార్యతో గొడవ జరిగింది. దీన్ని మనసులో ఉంచుకొని హైదరాబాద్ నుంచి పిల్లలను, భార్యను తీసుకొని హనుమకొండలోని వ్యూహ తల్లిగారింట్లో ఆమెను, పిల్లలను వదిలి వచ్చాడు. అనంతరం మంగళవారం రాత్రి ముస్త్యాలపల్లి శివారులో ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం రహదారిపై వెళ్తున్న ప్రయాణికులు గమనించి పోలీసులు, బంధువులకు సమాచారం అందించారు. కార్తీక్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బావిలో పడి వ్యక్తి మృతి


మృతిచెందిన పిట్టల మనోహర్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడి పిట్టల మనోహర్(45) మృతి చెందాడు. మనోహర్ మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. బుధవారం ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికారు. చివరకు బంధువుల సమాచారంతో వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

కుటుంబ ఆర్థిక పరిస్థితి చూడలేక ఆత్మహత్య


చెట్టి మానస

కాజీపేట: కుటుంబ ఆర్థిక పరిస్థితులు చూసి మనస్తాపంతో కాజీపేట 63వ డివిజన్ వడ్డెర కాలనీకి చెందిన చెట్టి మానస(18) మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మానస తండ్రి తిరుమలరావు పక్షవాతంతో రెండేళ్లుగా బాధపడుతున్నాడు. తల్లి ఉల్లిగడ్డలమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తోంది. కుటుంబ ఆర్థిక స్థితి బాగా లేక మానస ఆవేదనకు లోనైంది. మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్ సమీపంలో పడిపోయింది. బంధువులు గుర్తించి ఆసుపత్రికి తీసుకెళ్తుండగానే మృతి చెందింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు.

మహిళలది దృఢ సంకల్పం

- కుటుంబ పోషణ, సమాజ అభ్యున్నతికి కృషి
- మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- ఓరుగల్లులో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- కేయూలో హాస్టళ్లకు రూ.20 కోట్లు మంజూరు



మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

కేయూ క్యాంపస్: దృఢ సంకల్పం, ఆత్మ విశ్వాసంతో మహిళలు ముందుకెళ్లాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను తొలిసారిగా కేయూలోని ఆడిటోరియంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ కుటుంబ పోషణ, అభ్యున్నతికి మహిళలు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రుద్రమదేవి ఏలిన గడ్డపై అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం ఈప్రాంత ప్రజల అదృష్టమన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్నిరంగాల్లో మహిళలకు ప్రత్యేక స్థానం కల్పిస్తోందన్నారు. కేయూ వీసీ రమేశ్ విజ్ఞప్తి మేరకు కేయూలో రెండు హాస్టళ్ల భవన నిర్మాణాలకు రూ.20 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సత్యవతిరాథోడ్ ప్రకటించారు. కాకతీయ యూనివర్సిటీలో చదువుకోవాలనేది ఈప్రాంత విద్యార్థుల డ్రీమ్ అన్నారు.'నేను ఏడో తరగతిలోనే డ్రాప్ అవుట్ అయ్యాను. అప్పుడు ప్రోత్సహించేవారు లేక చదువును మధ్యలోనే ఆపేశాను, అయినా ఇప్పుడు ఈస్థాయికి ఎదగడమనేది దృఢ సంకల్పంతో ముందుకెళ్లడమే' అని మంత్రి సత్యవతి అన్నారు.

స్ఫూర్తినిచ్చే వేడుకలు..

ఈసభలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి భారతి హోలికేరి మాట్లాడుతూ.. ఓరుగల్లు గడ్డపై స్ఫూర్తినిచ్చేలా వేడుకలు నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ సెంటర్లలో మహిళల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ..

సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేయూ వీసీ తాటికొండ రమేశ్ మాట్లాడుతూ.. మహిళల పోరాటాల ఫలితంగానే హక్కులు సాధించుకోగలిగారన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ.. కాకతీయ గడ్డపై అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం వరంగల్ ప్రజల అదృష్టమన్నారు. హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ సమాజంలో అక్కడక్కడా మహిళలు సమస్యలు ఎదుర్కొంటున్నారని వీటిని నివారించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోందన్నారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ దీపికరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళల పట్ల గౌరవంగా వారిలోని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా తగు చర్యలు చేపడుతోందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో రాష్ట్ర వికలాంగుల సంస్థ చైర్మన్ డాక్టర్ వాసుదేవరెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, గ్రేటర్ వరంగల్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రావీణ్య, మహబూబాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ బిందు, జిల్లా పరిషత్ చైర్మన్ గండ్రజ్యోతి, 'కుడా' చైర్మన్, తెలంగాణ సరోగసి బోర్డు మెంబర్ హరి రమాదేవి, సుందర్ రాజు యాదవ్, డిప్యూటీ మేయర్ రిజ్వానా పోలీస్ అధికారి పుష్ప, అనుసూయ, తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఆడిటోరియం

కేయూలో మహిళా దినోత్సవ వేడుకలకు అధిక సంఖ్యలో మహిళలు, విద్యార్థినులు, ఐసీడీఎస్‌కు సంబంధించిన సిబ్బంది రావటంతో ఆడిటోరియం నిండిపోయింది. ఆడిటోరియం బయట కుర్చీల్లో కూర్చొని మరీ ఎల్‌సీడీ ప్రొజెక్టర్ ద్వారా వేడుకల్ని తిలకించారు. ఆద్యంతం ఉత్సాహంగా ఈవేడుకలు జరిగాయి.

27 మంది మహిళలకు సత్కారం

కాగా ఈ వేడుకల్లో రాష్ట్రంలోని వివిధ రంగాల్లో కృషి చేసిన 27 మంది మహిళలను మంత్రి సత్యవతి రాథోడ్, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించారు. ప్రశంస పత్రాలతో పాటు రూ.లక్ష నగదు, మెమొంటోలు అందించి సన్మానించారు.


కార్యక్రమానికి హాజరైన మహిళలు


పేరిణి శివతాండవ నృత్యం చేస్తున్న రంజిత్ బృందం


అంగన్‌వాడీ టీచర్ల నృత్యాలు


విద్యార్థుల నృత్య రూపకం


అందె భాస్కర్ బృందం విన్యాసాలు, డప్పు నృత్యాలు



మంత్రి సత్యవతి చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న కె.రాణిప్రసాద్, పొట్లపల్లి స్వరూప.. సోషల్ యాక్టివిస్ట్ దంటు కనకదుర్గ


మహిళా దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, మేయర్ సుధారాణి, సంగీతనాటక అకాడమీ చైర్‌పర్సన్ దీపికరెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి భారతి హోలికేరి, కమిషనర్ ప్రావీణ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బిందు

గుర్తింపుగా అవార్డు



అద్యకళపై అధ్యయనం చేశా. అందుకు గుర్తింపుగా ఈఅవార్డు రావడం సంతోషంగా ఉంది. నా సొంత గడ్డపై అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది.

- ఆచార్య గూడూరు మనోజ, వరంగల్

వచన కవిత్వానికి దక్కిన గౌరవమిది



నేను రాసిన 'లోపలి ముసురు' వచన కవిత్వం గతేడాది పుస్తకం రూపంలో వచ్చింది. దీనికి గాను అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది.

- అరుణ నారదభట్లు, హైదరాబాద్

ప్రతిభకు గుర్తింపు



నాకు 75 ఏళ్లు. 50 ఏళ్లుగా కిన్నెర వాయిస్తున్నా. ప్రభుత్వం గుర్తించి నాకీ అవార్డు ఇవ్వడం నా జీవితంలో మరిచిపోలేను.

- కల్లి, శంకరమ్మ, రాంనగర్, హైదరాబాద్

ఓని సిస్టర్స్



తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సంగీతంలో రాణించాం. ప్రభుత్వ అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. మహిళలు ఏ రంగంలో తక్కువ కాదు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు.

- ఓని సిస్టర్స్ వినోద, విజయ, విజయలక్ష్మి, కాశిబుగ్గ, వరంగల్

బాల సాహిత్యం



బాల సాహిత్యం రాస్తున్నా. వందల కథల్ని ఆడియోలుగా చేసి శ్రోతలకు అందుబాటులో ఉంచా. నా సేవల్ని గుర్తించినందుకు ఆనందంగా ఉంది.

- డా. కందేపి రాణిప్రసాద్, రచయిత్రి, రాజన్న సిరిసిల్ల జిల్లా

షీటీంలో సేవలకు..



హైదరాబాద్ పోలీస్‌శాఖ భరోసా కేంద్రంలో, షీటీంలో సేవలందిస్తున్నా. నా సేవలు గుర్తించి ప్రభుత్వం ఈ అవార్డు అందించింది.

- పి.రుక్మిణి, హైదరాబాద్

- హన్మకొండ కల్చరల్/కేయూ క్యాంపస్

కేసీఆర్ అంటే..

కే అంటే కాల్వలు.. సీ అంటే చెరువులు.. ఆర్ అంటే రిజర్వాయర్లు

- రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు
- వరంగల్ జిల్లా ఏనుగల్లులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభం


క్యాన్సర్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బోయినపల్లి వినోద్‌కుమార్ తదితరులు

సాక్షి, వరంగల్/పర్వతగిరి: కేసీఆర్ అంటే కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావునే కాదని.. కే అంటే కాల్వలు.. సీ అంటే చెరువులు.. ఆర్ అంటే రిజర్వాయర్లు అని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఏనుగల్లులో ప్రతిమా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ... తెలంగాణ వచ్చాక వైద్యంపై కేసీఆర్ సర్కార్ దృష్టి సారించిందని, కరోనా మహమ్మారి విజృంభన తర్వాత మరింత ప్రాధాన్యమిచ్చి అన్ని జిల్లాలో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తోందన్నారు. అదే సమయంలో స్వచ్ఛమైన నీరు, స్వచ్ఛమైన గాలి, స్వచ్ఛమైన ఆహారం కోసం.. ఇవన్నీ ఉంటే ఆరోగ్యం బాగుంటుందని కేసీఆర్ సర్కార్ పనిచేస్తోందన్నారు. స్వచ్ఛమైన నీరు అంటే మిషన్ భగీరథ ద్వారా కృష్ణా, గోదావరి జలాలను ఇంటింటికి అందిస్తున్నామని, 240 కోట్ల మొక్కలతో స్వచ్ఛమైన గాలి అందించేలా కృషి చేస్తున్నామన్నారు. మారిన ఆహారపు అలవాట్లతో మహిళలు చాలామంది బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ బారిన పడుతున్నారని, ఇవి ఆదిలోనే గుర్తిస్తే నియంత్రించవచ్చన్నారు. అందుకే ఏనగల్లులో ఏర్పాటుచేసిన మూడురోజుల ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అంతకుముందు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. కాబోయే సీఎం కేటీఆర్ అంటూ సభికులతో అనిపించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీలు బస్వరాజ్ సారయ్య, జెడ్పీ చైర్మన్ గండ్ర జ్యోతి, ప్రతిమా ఆస్పత్రి నిర్వాహకులు బోయినపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ హర్శిణి, జెడ్పీటీసీ సింగ్‌లాల్, ఎంపీపీ లూనావత్ కమల పంతులు, ఏనుగల్ సర్పంచ్ దమ్మిశెట్టి సంధ్య నర్సింగం, తదితరులు పాల్గొన్నారు.

హరిణి వాగ్ధాటి ఇక్కడి రాజకీయ నాయకులకు డేంజర్‌గా ఉంది..

డాక్టర్ హరిణి వాగ్ధాటి చూస్తుంటే ఇక్కడి రాజకీయ నాయకులకు భవిష్యత్‌లో పోటీగా వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. శిబిరంలో ముందుగా ప్రతిమా ఫౌండేషన్ ఫౌండర్, మెంబర్ డాక్టర్ బోయినపల్లి హరిణి మాట్లాడారు. ఆ తరువాత కేటీఆర్ మాట్లాడుతూ హరిణి ఎంతో చక్కగా మాట్లాడారని, ఆమె తీరు ఇక్కడి నాయకులను(ఎర్రబెల్లి దయాకర్‌రావు, అరూరి రమేశ్, బోయినపల్లి వినోద్‌కుమార్‌లనుద్దేశించి) రాజకీయంగా డేంజర్ జోన్‌లో పడేసినట్లు ఉందని, భవిష్యత్‌లో వీరికి పోటీగా వచ్చే అవకాశం ఉందంటూ నవ్వుతూ అన్నారు.

ఎస్‌ఐ వేధింపులతోనే నా కొడుకు చనిపోయాడు

- న్యాయం చేయాలని ఎంజీఎం మార్చురీ వద్ద ఆందోళన
- రెండు రోజులుగా మార్చురీలోనే వంశీకృష్ణ మృతదేహం


ఎంజీఎం మార్చురీ వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి తల్లి, కుటుంబ సభ్యులు

ఎంజీఎం: నా కొడుకు ఎస్‌ఐ శ్వేత వేధింపుల వల్లే మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుడు వంశీకృష్ణ తల్లి రాధతోపాటు కుటుంబ సభ్యులు బుధవారం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీ వద్ద ఆందోళన చేపట్టారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేటహవేలి గ్రామంలో కుమారస్వామి అనే వ్యక్తి ఇంట్లో బంగారాన్ని ఎత్తుకెళ్లాడని పోలం వంశీకృష్ణపై మార్చి 1న ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వంశీకృష్ణను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు కేసుపై వివరాలు సేకరించారు. ఈ క్రమంలో చేయని దొంగతనాన్ని నా కొడుకుపై మోపేందుకు పోలీసులు వేధింపులకు గురిచేయడంతో పోలీస్‌స్టేషన్ ముందు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. వెంటనే చికిత్స నిమిత్తం పోలీసులు ఎంజీఎంకు తరలించగా.. చికిత్స పొందుతూ వంశీకృష్ణ మృతి చెందాడని రోదిస్తూ పేర్కొన్నారు. నా కొడుకు మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకునే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించారు.

అంత్యక్రియలకు చిల్లిగవ్వలేదు..: తల్లి రాధ

నా భర్త ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. నా కొడుకు సంపాదనతోనే బతుకుతున్నా. నా బిడ్డ, నేను బతికేది ఎలా. కనీసం నా కొడుకు అంత్యక్రియలు నిర్వహించేందుకు సైతం చిల్లిగవ్వ లేదు.. ఇదేంది దేవుడా.. అంటూ ఆ తల్లి రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

సీపీ కలిసిన మృతుడి బంధువులు

కాగా.. వంశీకృష్ణ మృతి ఘటనపై న్యాయం చేయాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులు వరంగల్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీస్ కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అయితే విషయం తన దృష్టికి వచ్చిందని, విచారణ చేసి చర్యలు చేపడతామని సీపీ హామీ ఇచ్చినట్లు మృతుడి బంధుమిత్రులు తెలిపారు.

మార్చురీలోనే మృతదేహం

సోమవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి వంశీకృష్ణ పాల్పడగా.. గీసుకొండ పోలీసులు చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా.. వంశీకృష్ణ చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతిచెందిన విషయం విదితమే. తమకు న్యాయం జరిగే వరకు పోస్టుమార్టం జరిగేందుకు సహకరించేది లేదని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో బుధవారం రాత్రి వరకు వంశీకృష్ణ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించలేదు..

నేటినుంచి పలు రైళ్ల రద్దు

- పలు రైళ్ల దారి మళ్లింపు



కాజీపేట రూరల్/డోర్నకల్: డోర్నకల్-విజయవాడ రైలు మార్గంలో ఎర్రుపాలెం, గంగినేని స్టేషన్ల మధ్య మూడో లైన్ నిర్మాణ పనులు జరుగుతుండడంతో గురువారం నుంచి పలు రైళ్లు రద్దు కానున్నాయి. భద్రాచలం రోడ్-విజయవాడ, విజయవాడ భద్రాచలం రోడ్ ప్యాసింజర్ రైళ్లు బుధవారం నుంచి రద్దు కాగా.. కాజీపేట-విజయవాడ, విజయవాడ-కాజీపేట పుష్పుల్ రైళ్లు, గురువారం నుంచి 18వ తేదీ వరకు పూర్తిగా రద్దు కానున్నాయి. ప్రత్యేక రైళ్లకు సంబంధించి కాజీపేట-తిరుపతి(07091) 14న, తిరుపతి-కాజీపేట(07092) 14న రద్దు కానున్నాయి. మచిలీపట్నం-సికింద్రాబాద్(07185), సికింద్రాబాద్ మచిలీపట్టణం(07182) 12న రద్దు కానున్నాయి. గోల్కొండ ఎక్స్‌ప్రెస్ 18వ తేదీ వరకు సికింద్రాబాద్ నుంచి కాజీపేట వరకే నడుస్తుండగా.. ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ 18 వరకు సికింద్రాబాద్ నుంచి ఖమ్మం వరకు, ఖమ్మం నుంచి సికింద్రాబాద్ వరకు నడవనుంది.

దారి మళ్లించిన రైళ్లు ఇవే..

యశ్వంత్‌పూర్-టీకెడి(00629) వీక్లీ ఎక్స్‌ప్రెస్ మార్చి 14, 18, 21 తేదీల్లో గూడూరు, కాజీపేట, బల్లార్షా మీదుగా వెళ్లాల్సి ఉండగా.. ధర్మవరం-వాడి-సికింద్రాబాద్, కాజీపేట మీదుగా, తుక్లకబాద్-యశ్వంత్‌పూర్-తుక్లకబాద్ (00630) వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్ మార్చి 15, 18 తేదీల్లో బల్లార్షా-కాజీపేట-గూడూరు మీదుగా వెళ్లాల్సి ఉండగా కాజీపేట-సికింద్రాబాద్-వాడి-ధర్మవరం మీదుగా దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.